ఖరారు కాని.. జీహెచ్ఎంసీ బడ్జెట్!

- స్టాండింగ్ కమిటీ తిరస్కరించి పది రోజులు గడిచినా సవరించని ప్రతిపాదనలు
- ఈ వారంలో కమిటీ ముందుకు రావడం కష్టమే..
- జాప్యానికి ఫైనాన్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యమే అసలు కారణం

సిటీబ్యూరో, డిసెంబరు 8(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ 2025-26 ముసాయిదా బడ్జెట్ ఖరారు మరింత ఆలస్యం కానుంది. అక్టోబరులోనే బడ్జెట్ ప్రతిపాదనను ఆమోదం పొందాల్సి ఉన్నప్పటికీ నేటికీ ప్రతిపాదన కసరత్తు దశలోనే ఉంది. మొదటి వారంలో అన్ని శాఖల ముఖ్య అధికారుల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు తీసుకుని సవరణ చేసిన బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ముందుకు తీసుకురావాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. రూ.8,340 కోట్లతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలపై గత నెల 30వ తేదీన మేయర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆదాయ మార్గాలను తక్కువ చూపడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గడిచిన మూడేళ్లలో ఆదాయ రాబడిలో అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకటన విభాగం, ఎస్టేట్ విభాగం, ఆస్తిపన్ను, టౌన్ ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్‌లలో లోపాలను ఎత్తిచూపి బడ్జెట్ సవరణలు చేసి తుది బడ్జెట్‌ను ఖరారు చేయాలని మేయర్ ఆదేశించారు. ఇది గడిచి పది రోజులైనా బడ్జెట్ ఫైనల్ చేయలేదు. అధికారులు తలోదారి అన్నట్లుగా ఉండటం, ఫైనాన్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం వెరసి బడ్జెట్ ప్రతిపాదన మరింత ఆలస్యానికి కారణమైంది. ప్రజా విజయోత్సవాలలో కమిషనర్ బిజీగా ఉండటంతో సమీక్షించిన దాఖలాలు లేవు. అంతే కాకుండా దీనికి తోడు అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి మొదలు కావడంతో ఈ వారంలో జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశం జరగడం అనుమానంగానే ఉంది. దీంతో మరో పది రోజుల పాటు బడ్జెట్‌పై సమయం తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి.

అక్టోబరు నెలలోనే మొదలు పెట్టాల్సింది..

వాస్తవానికి అక్టోబరు నెలలోనే బడ్జెట్‌కి సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ.., డిసెంబర్ రెండో వారం వరకు సమయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ చట్టం -1955 ప్రకారం, కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను గత నెలలో బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటుంది. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు జనరల్ బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనబడుతున్నాయి. నిర్ణీత సమయంలో బడ్జెట్ ప్రక్రియను ముగిస్తారా? లేదంటే మార్పులు, చేర్పులతో ప్రభుత్వానికి సకాలంలో పంపించక కాలాయాపన చేస్తారా? అన్నది వేచి చూడాలి.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు ముగింపు వేడుకల సందర్భంగా నగరంలో బీఆర్ అంబేద్కర్ సచివాలయ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లుగా ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేయగా, సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని సూచించారు.

అసెంబ్లీలో ప్రస్తావించి బ్రిడ్జి సమస్యను పరిష్కరిస్తా

ఘట్‌కేసర్‌లో రిలేనిరహార దీక్ష చేస్తున్న మహిళలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 8: ఘట్‌కేసర్‌లో ఫెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరిస్తానని మాజీ మంత్రి మల్లారెడ్డి హామీ యిచ్చారు. ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. అయితే, పట్టణానికి చెందిన మహిళలు రాధిక, విష్ణు ప్రియ, సుభాషిణి, రమాదేవి, మాధవి, మమతా శర్మలు మేము సైతం అంటూ రిలే నిరహార దీక్షలో కూర్చున్నారు. ఈ నేపథ్యంలో శిబిరానికి చేరుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి మహిళలకు సంఘీభావం తెలిపారు. పట్టణ వాసులు అధైర్యపడొద్దని అండదండగా ఉండి ఆదుకుంటానని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి సొంత డబ్బులు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. ముందున్న కాంట్రాక్టర్ చేతులేత్తేస్తే మరో కాంట్రాక్టర్ చేత డబ్బులు పెట్టి చివరి దశ వరకు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జేఏసీ కమిటీ సభ్యులు మాజీ మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మారం లక్ష్మారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ ఎం డీ సిరాజ్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్ రెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, జేఏసీ సభ్యులు బచ్చు ప్రమోద్ గుప్తా, కమలాకర్, విక్రమ్ రెడ్డి, నాయకులు చిన్న శ్రీనివాస్ గౌడ్, ఖలీల్, మురళీ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, షానావాజ్, నజీర్, సత్తి, యాదగిరి పాల్గొన్నారు.

రైల్వే అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేసిన హమాలీ బస్తీ వాసులు

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 8: రైల్వే అధికారుల తీరుపై ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. పద్మారావునగర్‌లోని హమాలీ బస్తీ ఫేజ్ 1, 2 వాసులు, బోయిగూడలోని రైల్ కళారంగ్ బస్తీ వాసులు ఆదివారం మారేడుపల్లిలోని కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల రైల్వే శాఖ అధికారులు తమ బస్తీలలో కొన్నేండ్ల నుంచి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, శ్రీ నల్ల పోచమ్మ దేవాలయాలు రైల్వే శాఖ స్థలంలో నిర్మించారని, వాటిని తొలగించాలని నోటీసులు జారీ చేశారని, దానిపై తాము ఆందోళనకు గురవుతున్నామని ఆయనకు వారు వివరించారు. రైల్వే అధికారుల వ్యవహార తీరు బాగాలేదని, బస్తీ ప్రజల మనోభావాలతో అడుకోవద్దని, ఈ విశయమై తాను రైల్వే శాఖ జీఎంకు లేఖ రాస్తానని ఆయన అన్నారు. వెంటనే అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని ఆయన అన్నారు.

ఉద్యమకారుల సమస్యలపై సభలో ప్రస్తావించండి

250 గజాల స్థలాన్ని ఇస్తామన్న సీఎంను ప్రశ్నించండి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 8: తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పి గద్దెనెక్కి ఇప్పుడు ఉద్యమకారుల మాటను తీయకపోవడంపై ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రానున్న అసెంబ్లీ, శాసన మండలి సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదివారం ఉద్యమకారులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులకు పలువురు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యతను కల్పించడం లేదని, ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా ప్రస్తావించకపోవడం హేయమైన చర్య అని ఖండించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసి, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ది రాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, సమ్మయ్య నేత, సుధాకర్ గౌడ్, నదీమ్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రదర్శన వీక్షణకు కంచెలు!

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్ట మైసమ్మ ఆలయం పక్క నుంచి హుస్సేన్ సాగర్ ట్యాంక్‌బండ్‌పైకి తక్కువ సమయంలో పాదచారులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెట్ల దారి ఇది. ఈ దారి నిర్మాణమే పాదచారులు, సాధారణ ప్రజల కోసం ఏర్పాటు చేసింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏడాది పాలన విజయోత్సవం పేరిట హుస్సేన్ సాగర్‌పై ఆదివారం విమానాల ఎయిర్ షో నిర్వహించారు. దీనిని చూసేందుకు ఎంతో మంది ఆరాటపడ్డారు. జనం ఎగబడుతారనో.. లేక పాలకులు చేసిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతారనో...! కావొచ్చు... మెట్ల దారికి కాస్త ఇనుప కంచె వేశారు. అయినా కొందరు సాహసం చేసి.. ఆ దారి గుండా ట్యాంక్‌బండ్‌పైకి వెళ్లజూశారు. ఈ నేపథ్యంలో పలువురు మహిళలకు ఆ ఇనుప కంచె గుచ్చుకోవడం, వస్త్రాలు చినిగిపోవడం, పలువురు ఆ దారిలో పడిపోవడం జరిగింది. ప్రభుత్వ పాలకులకు ప్రజల భద్రతేమో..! గానీ, వారిని ఇబ్బందులకు గురి చేయడమే.. ధ్యేయంగా పెట్టుకున్నట్టు ఈ దృశ్యాలు చెబుతున్నాయి. ఇక ప్రజలే అర్థం చేసుకోవాలె..!!

వీక్షణ విందు.. విహంగ ప్రదర్శన

- ఆకట్టుకున్న ఎయిర్ షో
- ట్యాంక్ బండ్‌పై కిక్కిరిసిన జనం
- ప్రత్యేక ఆకర్షణగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో క్రాకర్ షో

సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): గగన తలంలో వైమానిక దళం చేసిన విన్యాసాలు నగర వాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సూర్యకిరణ్ వైమానిక బృందం ఆధ్వర్యంలో ఫైటర్ జెట్లతో హుస్సేన్ సాగర్ ఉపరితలంలో చక్కర్లు కొట్టిన యుద్ధ విమానాలను చూసి సందర్శకులు నివ్వెరపోయారు. హెచ్ఎండీఏతో పాటు పలు విభాగాల సమన్వయంతో ట్యాంక్ బండ్ పరిసరాల్లో భాగంగా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలకు చూసేందుకు జనాలు ఆదివారం భారీగా చేరుసుకున్నారు. యుద్ధ విమానాలతో ఎయిర్‌ఫోర్స్ బృందం చేసిన ఎయిరో బాటిక్ షో అద్భుతంగా నిలిచాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విన్యాసాలను సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులు, నగరవాసులు తిలకించారు. తొమ్మిది జెట్ విమానాలతో నిర్వహించిన విన్యాసాలు సర్వత్రా నగర ప్రజలను అలరించాయి. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన వ్యూ డెక్ నుంచి వీక్షించారు.

జన సాగరంలా..

ట్యాంక్ బండ్ పరిసరాలన్నీ జనాలతో నిండిపోయాయి. తొమ్మిది ఫైటర్ జెట్ విమానాలతో ఆకాశంలో చేసిన విన్యాసాలను చూసేందుకు ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, తెలుగు తల్లి ఫ్లైఓవర్‌తో పాటు, ట్యాంక్ పరిసరాల్లో ఉండే అబిడ్స్, ఖైరతాబాద్, లోయర్ ట్యాంక్, గాంధీనగర్, వరకు బిల్డింగులపై నుంచి ఎయిర్ షోను తిలకించారు. ఇక ట్యాంక్ బండ్‌పై ఇప్పటికే లైటింగ్, లేజర్ షోతో పాటు, ప్రత్యేకమైన క్రాకర్ షోను హెచ్ఎండీఏ ఏర్పాటు చేసింది.

స్తంభించిన ట్రాఫిక్

హుస్సేన్ సాగరంపై విమానాల ప్రదర్శన నిర్వహించడంతో ట్యాంక్‌బండ్ పరిధిలోని ఎన్టీఆర్ మార్గ్‌లో ఆదివారం ట్రాఫిక్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు.

బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నా

అబిడ్స్, డిసెంబర్ 8: తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు, ఇతర పార్టీలో చేరినట్లు ఆధారాలతో ఎవరైనా నిరూపిస్తే రూ.11 లక్షల నజరానా అందిస్తానని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గౌలిగూడ చమాన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉండగా, కొందరు కావాలని పని గట్టుకుని ఇతర పార్టీలో చేరినట్లు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే ఎంతో క్రమ శిక్షణతో రాజకీయాలలో కొనసాగుతున్న తనను అప్రతిష్ట పాలు చేసేందుకు కొంత మంది వ్యక్తులు తాను బీఆర్ఎస్ పార్టీని వీడి ఇతర పార్టీలో చేరినట్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీ తనపై ఎంతో విశ్వాసం ఉంచి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి తనకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించారని తెలిపారు. నైతిక విలువలకు కట్టుబడి ఉంటానని, తాను ఏ రాజకీయ పార్టీలోనైనా చేరినట్లు ఎవరైనా రుజువు చేస్తే తాను చార్మినార్ భాగ్యలక్ష్మి సాక్షిగా రూ.11 లక్షల నజరానా అందజేస్తానని తెలిపారు. తాను ఐదు నెలల క్రితం బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు రాజీనామా పత్రాన్ని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావుకు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఐతే కొన్ని రోజులకే పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమ స్ఫూర్తి, పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సిద్ధాంతాలను గుర్తు చేసుకుని తన రాజీనామాను ఉపసంహరించుకుని తిరిగి ఉద్యమ పార్టీలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు.

సమావేశంలో రూ.11 లక్షల చెక్కును చూపుతున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని నాచారం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసిన వెలమ కులస్థులు

వెలమలను ఎమ్మెల్యే దూషించడం సరి కాదు

వెలమ అసోసియేషన్ ఈస్ట్ హైదరాబాద్

రామంతాపూర్, డిసెంబర్ 8: షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించడం సరైన పద్ధతి కాదని వెలుమ అసోసియేషన్ ఈస్ట్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నవీన్ రావు విమర్శించారు. వెలమల అంతు చూస్తానని బెదిరించడంతో వెలుమల మనోభావాలు దెబ్బ తిన్నాయన్నారు. ఆదివారం ఈ విషయమై పలువురు వెలమ సభ్యులతో కలిసి నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

నెక్లెస్ రోడ్‌లో హానర్ రన్

హానర్ నగర్‌లో పాల్గొన్న సైనికులు, మాజీ సైనిక అధికారులు

ఖైరతాబాద్, డిసెంబర్ 8: దేశ రక్షణలో సైనికుల సేవలను కీర్తిస్తూ నెక్లెస్ రోడ్‌లో ఆదివారం 'హానర్ రన్' పేరుతో 4కే, 5కే, 12.5కే రన్‌ను నిర్వహించారు. సైనికులు, మాజీ సైనికులు పాల్గొన్న ఈ రన్‌ను మేజర్ జనరల్ అఖిలేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దులో నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రతికూల వాతావరణంలోనూ రక్షణగా నిలిచే సైనికుల సేవలు వెలకట్టలేనివన్నారు.

దగాపడ్డ కళాకారుల డప్పుల మోత

12న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కళాకారులు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 8: రాష్ట్రంలో అర్హులైన కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న బాగ్‌లింగంపల్లిలోని 'దగాపడ్డ కళాకారుల డప్పుల మోత' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యమ కళాకారులు తెలిపారు. గాయకుడు నేర్నాల కిషోర్ నేతృత్వంలో 32 గంటల పాటు జరిగే పాటల కార్యక్రమానికి కళాకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కళాకారులు సాయన్న, భూంపల్లి అశోక్, గౌర యాకన్న, మౌనిక, సంపత్, రవి, రాజశ్రీ, మహేశ్, శ్రీరామ్, కల్యాణి మాట్లాడుతూ, తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్కలను ఆహ్వానించామని చెప్పారు.

వసీరా ఏనుగమ్మ ఏనుగు పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి శివారెడ్డి తదితరులు.

ఖైరతాబాద్, డిసెంబర్ 8: కవి, రచయిత వసీరా రచించిన 'ఏనుగమ్మ ఏనుగు' పుస్తకాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేంద్ర సాహిత్య, సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత, సుప్రసిద్ధ కవి శివారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కవిగా వసీరా అనేక కవితలను రాశారని, అందులో శిల్పి కవిత్వంలో అధ్యాత్మిక భావనలు ఉన్నాయని, ఏనుగమ్మ ఏనుగు కవితల్లో చిన్న పిల్లల దృష్టిలో పెట్టుకొని రాశారన్నారు. వసీరాలో ఊహజనితమైన ఆలోచనలు కవిత్వంలా రూపుదిద్దుకుంటాయని, ఆయనలో అద్భుతంగా రాసే శక్తి ఉందని, ప్రముఖ కవి పెమ్మరాజు గోపాల కృష్ణ ఆయనలో స్ఫూర్తి నింపారన్నారు. అలాగే, వసీరా కవిత్వం మనుషుల పట్ల ప్రేమను వ్యక్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, చిత్రకారులు, పాత్రికేయులు వాడ్రేవు చిన వీరభద్రుడు, జగన్నాథ శర్మ, ప్రసాద మూర్తి, శ్రీధర్ బాబు, వాసిరెడ్డి నవీన్, విమల, చీకోలు సుందరయ్య, తల్లావజ్జల శివాజీ, ప్రచురణ కర్త మల్లికార్జున్, వసీరా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రచయితలకు ప్రగతిశీల దృక్పథం అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న సాహితీవేత్త నందిని సిధారెడ్డి

రవీంద్రభారతి, డిసెంబర్ 8: తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలు ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. తెరసం అధ్యక్షుడు డా.నాళేశ్వరం శంకరం అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.శంకర్ పదేండ్ల నివేదికను సమర్పించారు. వక్తలుగా కవి నిఖిలేశ్వర్, కవి డా. నందినీ సిధారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ రచయితలకు ప్రగతిశీల దృక్పథం అవసరమన్నారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ తోరణం, బతుకమ్మ, చార్మినార్ మొదలైన వాటిని తొలగించుటను రచయితలుగా ఖండించాలి. విద్వేష సంస్కృతిని వ్యతిరేకించాలన్నారు. తెలంగాణలోని బహుళ, సామరస్య, సంస్కృతి పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. తెలంగాణ భాష, జీవితం, సంస్కృతిని మార్కెట్ సరుకుగా మారుస్తున్న ధోరణి ఖండించాలని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంపై ప్రొఫెసర్ పి.కాశీం మాట్లాడుతూ, తెలంగాణ అస్తిత్వ సాహిత్య, వర్తమాన భవిష్యత్ సాహిత్యం గురించి ఆయన మాట్లాడారు. అనంతరం, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బాణాల భుజంగరెడ్డి, దాశరాజు రామారావు, మోత్కూర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.